# 1 హోటలు పరిచయుడు

నేనూ, నాదెళ్లా, మద్దూరీ, పంచాంగమూ ఆ అరవ హోటల్లో భోంచేస్తూ ఉండేవాళ్లం. పంచాంగం మటుకు హోటల్లోనే గది తీసుకుని ఉండేవాడు. మా ఆదివారాలూ శలవ రోజులూ అక్కడే గడిచిపోతూండేవి. కారణమేమంటే హోటలు కుర్రాణ్ని కేకేసినప్పుడల్లా కావలసిన కాఫీ పట్టుకొస్తూండేవాడు. వెళ్లేటప్పుడు తలా ఒక అణా బేడా వాడి చేతిలో పెట్టేవాళ్లం. కాఫీ ఖర్చు మటుకు పంచాంగం వాడి ఖాతాలో పడేది.

అదే ముఖ్యమైన విషయం. ఆ రోజుల్లో మేం ఆ విధంగా జీవించేవాళ్ళం— సాధ్యమైనంతవరకు మా ఖర్చు మరెవడి మీదనైనా వేస్తూ. అదే మామూలు మనుష్యులు చేస్తే అది నీచత్వం అనిపించుకోవచ్చు, మరేమన్నా అనిపించుకోవచ్చు. కాని మాకది ఒక జీవిత లక్ష్యం, ఒక పరమార్థం. ఆ విధంగా జీవించి డబ్బులు వెనకేసి కొంపలు కట్టిద్దామని కాదు. అందులో నిజంగా పైకి కనిపించేటంత తప్పేమీ లేదు. అందరూ ఆ విధంగా జీవించడం మొదలుపెడితే లేనివాడికూడా కలవాడితోపాటు జీవించే అవకాశం వొస్తుందని మాకో గట్టి విశ్వాసం. అట్లా జీవించటంవల్ల మనుషుల

మధ్య సాంఘిక సంపర్కం జాస్తి అవుతుందని మాకో నమ్మకం కూడా ఉండేది... ఒకవేళ అటువంటి ప్రవర్తనలో ఏ మాత్రం తప్పుగాని ఉంటే, అప్రయత్నంగా అందరూ చెయ్యటానికి ప్రయత్నించే పనే గనక, అటువంటివి ప్రయత్నపూర్వకంగా సిద్ధాంతరీత్యా చెయ్యటం వల్ల దానికి కొంత సంస్కారం ఆపాదించుకుంటుందని మా ఆశ.

నిజానికి జీవితంలో గాని మనుష్యుల్లోగాని మంచి అంటూ అట్టే ఉందనే నమ్మకం మాలో ఎవరికీ లేదు. పెళ్లిళ్ళలో అల్లుళ్ళు అలగటంలోనూ, ఆడబిడ్డలు అన్నదమ్ముల దగ్గర్నుంచి వస్తువాహనాలు రాబట్టుకోవటంలోనూ, అక్కరలయినప్పుడు చుట్టపక్కాలొచ్చి పడి తినికొంచెం లోటొస్తే చెడ తిట్టిపోవటంలోనూ మాకేమీ సంస్కారం కనిపించలేదు. కాని సంఘములో అటువంటివి ఉంటూనే ఉన్నై. మాలో మేం సినిమా కెళ్లాలనుకున్నా, కాఫీహోటలు కెళదామనుకున్నా ఎవడో ఒకడికి జరిమానా విధించటంలో అంతకన్న ఎక్కువసంస్కారమేఉన్నట్టుకనిపించింది. లేనివాడి దగ్గరడబ్బు ఎట్లాగూ వసూలు చెయ్యలేం. ఇవాళ ఫైను చెల్లించుకున్న వాడు రేపు తనవంతు వచ్చినప్పుడు మరొకడిచేత చెల్లింపజేస్తాడు. కేవలమూ సాంస్కారికమైన ఒత్తిడేకాని సాంఘికమైన ఒత్తిడి కాదు. ఫైను వేసుకునే తాహతు ఉండి కూడా స్వార్థంకొద్దీ తప్పించుకోజూసినవాడు మా సాంగత్యానికి దూరమైపోతాడు ! వాడి కదే శిక్ష !

మమ్మల్ని చూసి చాలామంది భయపడేవాళ్లు. మాకు

రాంబందులనీ, తోడేళ్ళనీ, అప్పులవాళ్ళనీ, బాకీదార్లనీ ఇంగ్లీషులోనూ తెలుగులోనూ కూడా నామకరణం చేశారు. ఆ నామకరణాలన్నీ మేం బిరుదుల కింద స్వీకరించాం. మేం చాలా ఘనులమని అనుకునేవాళ్ళం.

ఈ సిద్ధాంతం మా తలకాయల్లో క్రమ క్రమంగా ఒక స్వరూపం దాల్చింది. దీనికి ఆ స్వరూపం ఇవ్వటానికి బుర్రతో విశేషంగా పనిచేసినవాణ్ణి నేనే. అయితే మిగిలిన ముగ్గురూ సంపూర్ణంగా ఆమోదించారు. ఆ విధంగా అది మా ఉమ్మడి సిద్ధాంతమయింది.

* * *

ఆ హోటలుకు ఒక కొత్త మనిషి రాసాగాడు. అతను తెలుగువాడని తెలుస్తూనే ఉంది. కాని, నలుగురం సాటి వాళ్ళం గట్టిగా మాతృభాషలో అరుస్తూ, వడ్డించేవాళ్ళకి తెలుగు నేర్పుతూ సందడిగా భోంచేస్తున్నా కూడా, అతను మాకేసి చూడనైనా లేదు. పొడి అరవం ముక్కల్తో పని కానిచ్చుకుని భోంచెయ్యసాగాడు.

అతను భోంచేసే వైఖరి చూస్తే మాకు చాలా "బూర్జువా"గా కనిపించింది.(ఆ రోజుల్లో మా సిద్ధాంతాలకు భిన్నంగా ఉన్నదల్లా మాకు బూర్జువాగా కనిపించేది.)అతను భోంచేస్తూ నెయ్యి వడ్డించేటప్పుడు చాలుననేవాడు. వడ్డించేవాడు వేసేదే రెండు గరిటెలు.ఎక్కువ కావలసినా ఎక్స్‌ట్రా ఇస్తే తప్ప ఒక్క చుక్కయినా రాల్చడు. అది అందరికీ తెలుసు. అటువంటప్పుడు చాలునని చెయ్యి విస్తరి కడ్డం పెట్ట

టం బూర్జువా కాదూ ? పైగా ఒకరోజూ, రెండు రోజులా ? రోజూ, రెండు పూట్లా ఇదే వరస. అతను అత్తవారింట అల్లుడు లాగా భోజనం చేస్తూంటే అతని "మర్యాద" చూసి మొదట మాకు వేళాకోళంగా ఉండేది. అది రాను రాను తృణీకార భావం కిందికి మారింది.

"వీడికి ఫైను వెయ్యాల్సిందేరా!" అన్నాడు మద్దూరి.

"ముందు వీడి పరిచయం చేసుకుందాం పట్టండి," అన్నాడు నాదెళ్ల.

ఓ రాత్రి భోజనానంతరం అతన్ని పలకరించి పంచాంగం వాడి గదికి తీసుకుపోయి అక్కడ అతని ఆరా కొంత తీశాం. అతని మాటల తీరులో కూడా ఆ మర్యాదా లోభత్వం కనిపించింది. మా అందరి దగ్గరా తలా కాస్తా గౌరవం సంపాదించి చంకన పెట్టుకుపోదామని అతని ఉద్దేశం! ఫైను తప్పక వెయ్యాల్సిందే.

ఆ పూటకి అతనిచేత కిళ్లీలూ సిగరెట్లూ కొనిపించి ఫైను వేశాం. తీరా చూస్తే అతను కిళ్లీ వెయ్యడు, సిగిరెట్టు ముట్టడు, కాని ఫైను చెల్లించాడు— సంతోషంతోనే.

"మా పద్ధతులు మీకు కాస్త విపరీతంగా తోస్తాయేమో. కాని వాళ్ళకి ఫైను వెయ్యటం మేము తప్పుగా భావించం. మమ్మల్ని మీరుకూడా వెయ్యొచ్చు. ఉన్నవాడూ లేనివాడూ దాదాపు ఒకే విధంగా బతకటానికిది మంచి పద్ధతని మేం తేల్చుకున్నాం," అన్నాడు నాదెళ్ళ.

"మీరు మార్క్సు పుస్తకాలు చదివారా ఏం ?" అన్నాడతను.

మా సంస్కారమంతా మంట గలిపి మమ్మల్ని కామ్రేడులకింద జమకడుతున్నందుకు మాకు కోపం వచ్చింది.

"మే మటువంటి చెత్త చదవం, మీరు చదవకండి" అన్నాం.

"మీరొక వేళ సోషలిస్టులేమోఅనుకున్నాను" అన్నాడతను.

"ఎంతమాట ! కావలిస్తే మాది కల్చరల్ కమ్యూనిజం అనండి" అన్నాం.

"మీ కల్చరల్ కమ్యూనిజం డబ్బుతోకూడి ఉన్నట్లు కనిపిస్తుంది ?" అన్నాడతను.

"డబ్బుకు మేం తక్కువ స్థానం ఇస్తాం. సంస్కారం ముందొస్తుంది."

"అదా విషయం ?..., సెలవు. మళ్ళీ కలుస్తాను."

* * *

ఆ రోజు లగాయతు అతనికి ఫైనులుతగిలిస్తూవచ్చాం. అతనెక్కడా వెనకాడలేదు. కాని అతను మాకు ఫైను వేసిన పాపాన పోలేదు. మా నలుగురిలో ఒకరికొకరు ఫైనులు వేసుకోవటం చాలా తగ్గిపోయింది. అందరి దగ్గరా డబ్బు కనిపిస్తున్నది, ఏడో తారీకు దాటిన తరువాత కూడా.

ఎప్పుడన్నా దారి తప్పి మాలో మేం ఏ సినిమా ప్రోగ్రాంగానీ పెట్టుకున్నప్పుడు మా కొత్తస్నేహితుణ్ణిపిలవాలనే ఆలోచన మాకు కలిగేది కాదు.

నా సిద్ధాంతానికి అపాయం కలుగుతున్నట్టు కనిపించి నేనే కొంచెం సణగసాగాను. అతన్నికూడా మావెంట పిలవటం సంస్కారరీత్యా అవసరంగా కనిపించింది.

"ఎందుకులేరా? పోనిస్తూ! వెధవ సినిమాకు అతను కావాలంటే పోలేడా? డబ్బున్నవాడల్లేనే ఉన్నాడులే. ఎందుకొచ్చినఖర్చు? సిగరెట్లన్నా తగలెయ్యొచ్చు," అన్నారు నాతోటి సంస్కార్లు. నాకుమండిపోయి "మనం సోషలిస్టులమా?" అని అడిగాను.

"ఎంతమాత్రముకాము. అయితేమటుకు డబ్బు వృధాగా తగలెయ్యాలా ఏమిటి?" అన్నారు వాళ్ళు.

నేనారోజు వాళ్ళవెంట సినిమాకు వెళ్ళలేదు.

"మరోతొమ్మిదణాలు ఆదా!" అన్నారు వాళ్ళు నా మొహానే!

నేను చాటుగా మాహోటలు స్నేహితుడితో పరిచయం ప్రారంభించాను.

"మీరు మాకోసం డబ్బెందుకు ఖర్చుచేస్తున్నారు? మేం డబ్బుకోసం మీవెంటపడటంలేదని మీకెట్లా తెలుసు?" అన్నానొకసారి.

"డబ్బుకోసమే నావెంట పడుతున్నారు. కాదని నేనెప్పుడు అనుకోలేదే" అన్నాడతను.

నాకు కోపంవచ్చింది. కాని దాన్ని ప్రకటించేందుకు నాకర్హత ఉన్నట్లు కనిపించలేదు.

"అయితే మరెందుకు ఖర్చు చేస్తున్నారు?"

"డబ్బుకోసం వెంటపడుతున్నారు గనక డబ్బిస్తున్నాను. డబ్బక్కర్లేని వాళ్ళకి డబ్బిచ్చి ఏంలాభం ?"

"డబ్బు అందరికీ యిస్తారా ? అంత డబ్బుందా మీ దగ్గిర ?"

"లేదు, కాని ముందు డబ్బిచ్చి తరవాత సంస్కారం కూడా ఇద్దామనే !"

"మాకు సంస్కారం లేదా ?"

"అవసరమైన సంస్కారం లేదు."

"ఏమిటా సంస్కారం ?"

"సంస్కారంకన్న డబ్బే ప్రధానమయిందనే జ్ఞానం. మీరు సంస్కారంకోసం దేవులాడుతూంటే మీచేతికి డబ్బే దొరుకుతున్నది. మీచేత డబ్బుకోసం దేవులాట ఆరంభింపచేసి సంస్కారం ఇప్పింతామని నాకు ఆలోచన కలిగింది"

నా కనుమానం వేసింది.

"మీరు మార్క్సు పుస్తకాలుగాని చదవలేదు గదా ?

"కొద్దిగా చదివాను"

"సోషలిస్టే? "

"కొంతవరకు"

హతాశుణ్ణయిపోయినాను.

"మాచేత ఏం చేయింతామని మీ ఉద్దేశం ?"

"పోలం దున్నింతామని"

"పొలం దున్నించటమే ? ఎక్కడ ?"

"భద్రాచలం దగ్గిర నూరెకరాలు కొన్నాను. అక్కడి మనుష్యుల్ని పెట్టి అంతా నేనే చేయించగలను. కాని ఇక్కడ డబ్బుకోసం అగచాట్లుపడే చదువుకున్నవాళ్ళని పట్టుకెళ్ళి వాళ్ళు చేయగలిగినంత భూమి ఇచ్చేసి ఒక కాలనీ ఏర్పరచాలనుకున్నాను. హాయిగా తిన్నది అరిగేట్టు పని చేసుకోవచ్చు. కూలీలతో సరిసమానంగా జీవించవచ్చు. వాళ్ళకి సంస్కారం ఇవ్వొచ్చు. వాళ్ళుకూడా మనంత వాళ్ళుగా పరిణమిస్తుంటే ఆ పరిణామం చూసి ఆనందించవచ్చు. వాళ్ళని మనం దోచకుండా వుంటే వాళ్ళు మనకన్నా సంపాదనల్లో ఎంత ముందుకు పోతారో తెలుసుకోవచ్చు. ఇదంతా సంస్కారమూ, అనుభవమూ కాదా ?" అన్నాడతను.

"అంతదూరం వెళ్ళి కాయకష్టంపడేకన్న ఇక్కడే తేలిక ఉద్యోగాలు సంపాదించి హాయిగా పుస్తకాలు చదువుకుంటే—" అని ప్రారంభించాను.

"తేరగా డబ్బొస్తుంటే సంస్కారం రాదు, గమనించే వుంటారు. పుస్తకాలు ఎన్నటికీ అనుభవంకాదు... ఏమిటి, వస్తారా ? మీ స్నేహితులక్కూడా చెప్పండి, ఆహ్వానించానని. కానీ పెట్టుబడిలేదు. చేసుకున్నంత భూమి యిస్తాను. వాళ్ళకి డబ్బుమీద ఇష్టంలేక నా ఆహ్వానం రుచించక పోవచ్చు. అయినా చెప్పి చూడండి" అన్నాడు.

"చెబుతానులెండి... నామటుకు నేను... ఇంకా కనీసం రెండేళ్ళవరకూ ఇంటిపట్టున ఉండి—ఏదీ?" అన్నాను.

"మీ యిష్టం" అన్నాడతను.

అంతే! మళ్ళా నాకా గొడవే జ్ఞాపకంలేదు. ఇప్పుడిదంతా ఎందుకు జ్ఞాపకం వచ్చిందంటే ఈ మధ్య నేను మద్దూరి వాడికి ఓ పాతిక పంపించరా అని రాస్తే లేదని సమాధానం రాసి, ఆ మర్నాడే కొత్తమేడకు పునాది తవ్వించటం మొదలుపెట్టాడు. నా హోటలు స్నేహితుడికన్నా రాద్దామంటే అతని పేరే జ్ఞాపకంలేదు. కాకపోయినా ఈ యుద్ధం రోజుల్లో నాలుగెకరాలన్నా లేని నాబోటివాడికి మరీ ఇబ్బందిగా వుంది. రెండెకరాలున్న వాళ్ళుకూడా గొప్పవాళ్ళయి కూర్చున్నారు మరీనూ !